# ‘గృహజ్యోతి’కి వివరాలను అందజేయాలి



షాబాద్ మండలం ముద్దెంగూడలో గృహజ్యోతికి వినియోగదారుల వద్ద వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ నరేందర్

షాబాద్, ఫిబ్రవరి 10: గృహజ్యోతి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి విద్యుత్ వినియోగదారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు , రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట లైన్‌మెన్‌లు జంగయ్య, పరశురాం, సిబ్బంది తదితరులున్నారు.

**గృహజ్యోతి నమోదుకు ప్రత్యేక కేంద్రం**

ఆమనగల్లు : ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందించి బిల్లింగ్ మిషన్‌లో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇంటి వద్ద వివరాలు నమోదు చేసుకోనివారి కోసం ప్రత్యేకంగా ఆమనగల్లు పట్టణంలోని గాంధీ చౌక్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ వినియోగదారుల కేంద్రంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

కడ్తాల్, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం అమలుకు, విద్యుత్ శాఖ అధికారులు చేపట్టిన సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. రీడింగ్ కోసం వచ్చే అధికారులకు వినియోగదారులు సహకరించాలని ఏఈ నరేందర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఇమ్రాన్‌బాబా, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో పూజలు



వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 10: అమావాస్య సందర్భంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలోని వీరభద్రస్వామికి శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి



హత్తిగూడలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌దత్తు, కౌన్సిలర్ లక్ష్మణ్ తదితరులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 10: హత్తిగూడ రెవెన్యూ సర్వేనంబర్ 12లోని 2.33 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణం, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేసుకునేందుకు సహకరించాలని కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తుకు విన్నవించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నదని, ఆ భూమిని కాపాడి ప్రజాప్రయోజనాలను వినియోగించుకునేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన రవీందర్‌దత్తు నేరుగా హత్తిగూడలోని స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ వినతులపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు సీపీఐ రాష్ట్ర నాయకుడు యాదిరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్ తెలిపారు.

## ఇండ్ల నిర్మాణానికి చేయూత

కడ్తాల్, ఫిబ్రవరి 10 : నియోజకవర్గంలోని నిరుపేదల ఇండ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన కమటం యాదయ్య, తోట తిరుపతయ్యల ఇండ్ల నిర్మాణాలకు శనివారం ట్రస్ట్ తరపున స్టీల్, సిమెంట్‌ను అందజేశారు. పేద కుటుంబాలను ఆదుకుంటామని వారు గుర్తు చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమావతి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు అసత్, కిషన్, ఆశ్రఫ్, పాండురంగయ్య, విష్ణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.40వేల ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

షాబాద్, ఫిబ్రవరి 10: అకాల మరణానికి గురైన చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. షాబాద్ మండలంలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన ఉప్పరిపల్లి బాలకృష్ణయ్య ఈ నెల 3వ తేదీన అకాల మరణం చెందాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988లో పదవ తరగతి చదువుకున్న అతడి చిన్ననాటి స్నేహితులు బాలకృష్ణయ్య కుటుంబానికి అండగా నిలిచారు. శనివారం కొంతమంది స్నేహితులు కలిసి అతడి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. తమవంతుగా రూ.40వేల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు శ్రీనివాస్, ముత్యంరెడ్డి, కుమ్మరి యాదగిరి, రంగయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సన్మానం



జూడోలో విజేతగా నిలిచిన దీపికను సన్మానిస్తున్న ఎంఈవో వెంకటయ్య

మొయినాబాద్, ఫిబ్రవరి 10 : విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని ఎంఈవో వెంకటయ్య అన్నారు. మండలంలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలతోపాటు ఇంటర్ సొసైటీల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడం.. మరికొందరు పాఠశాల, కళాశాలలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం షీల్డ్‌లు బహూకరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఎంఈవో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు కోశాధికారి లక్ష్మణ్, కార్యదర్శి రామగల్ల గిరిబాబు, కమిటీ సభ్యులు శ్రీనివాస్, మాదవ్, మాధవి, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుర్తింపు కార్డులు, బెల్టులు



మంచాల, ఫిబ్రవరి 10 : దాత్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు గుర్తింపు కార్డులు, బెల్టులను దాత శ్రీనివాస్ శనివారం ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం నిర్మల మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాతలసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ యాదగిరి, ఉపాధ్యాయులు రాములు, కిరణ్‌కుమార్, లలిత పాల్గొన్నారు.

## బాలయేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవం



బాలయేసు పుణ్యక్షేత్రం

తుర్కయంజాల్,ఫిబ్రవరి 10: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని బాలయేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవం శనివారం మొదలైంది. వంద సంవత్సరాల చరిత్ర గల బాలయేసు పుణ్యక్షేత్రంలో జరిగే ఉత్సవాలను స్థానికంగా ఊరి పండుగ పేరుతో పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండో శని, ఆదివారాల్లో ఊరి పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. చర్చి ప్రాంగణంలోని దేవమాతా గుహ కట్టడం, ఏసుక్రీస్తు జీవితాన్ని శిలువ విగ్రహాలతో తెలిపే పవిత్ర భూమితో పాటు కలవరి కొండ నిర్మాణాలు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సారి ఉత్సవాలను ఈ నెల 1వ తేదీన చర్చి ప్రాంగణంలో ఖమ్మం క్రైస్తవ రిటైర్ట్ పీఠాధిపతి పాల్ మైపాన్ చేతుల మీదుగా బాలయేసు పతాక ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. భక్తులు ఉత్సవాలకు హాజరయ్యే విధంగా ఆర్టీసీ నగరం నుంచి తుర్కయంజాల్‌కు బాలయేసు స్పెషల్ పేరుతో బస్సు సర్వీసులను నడుపుతున్నది.

## చదువుతోనే సమాజంలో గుర్తింపు

- రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అదనపు డీసీపీ సాధన రేష్మి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 10: చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం పెరుగుతుందని రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధనారేష్మి అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శ్రీచైతన్య కళాశాల ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, కళాశాలకు పేరు తీసుకు రావాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఆడపిల్లలు సమస్యలు ఎదురైనప్పుడు 100కు కాల్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, డైరెక్టర్లు శ్రీకాంత్, మనోహర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

కడ్తాల్, ఫిబ్రవరి 10: నూతన మండలం కడ్తాల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గురించి ఎమ్మెల్యేకు వివరించారు. మండలాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేని కోరినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో చరికొండ ఎంపీటీసీ రాములుగౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 15న సర్వసభ్య సమావేశం

కొత్తూరు, ఫిబ్రవరి 10: కొత్తూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని వివరించారు. ఎంపీటీసీలు, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు హాజరుకావాలని సూచించారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



తంగడిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 10 : పరిసరాల పరిశుభ్రతతోనే మనందరి ఆరోగ్యం భద్రంగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రావు అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ పరిసరాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పంచాయతీ సిబ్బంది చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యదర్శి సురేందర్ రావు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.


# మతతత్వ విధానాలపై ప్రతిఘటిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటించేందుకు ఈనెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆటోనగర్‌లోని మెకానికల్, టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అదే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం.. మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్ సీట్ కట్టిద్దాం అనే నినాదంతో దేశవ్యాప్త కార్మికుల సమ్మెను, భారత్ గ్రామీణ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి తెలిపారు. సమ్మె విజయవంతం కోసం ఈనెల 14న ఆటోనగర్ నుంచి ఎల్బీనగర్ వరకు బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన పేదలు మరింత పేదలుగా మారుతున్నారని తెలిపారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, సామిడి శేఖర్‌రెడ్డి, శంకర్‌నాయక్, లింగంగౌడ్, కృష్ణయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు. ఫిబ్రవరి 10** : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నదని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు.మండల కేంద్రంలో ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంకగాల్ల కుమార్‌తో కలిసి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు అయిన ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 14నెలలు ఢిల్లీలో వీరోచిత పోరాటం రేసి రైతుల వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టిన ఘనత రైతులదని అన్నారు. తిరిగి నరేంద్ర మోదీ ప్రభుత్వం మళ్లీ ఆ చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కులం, మతం పేరుతో కేంద్ర ప్రభుత్వం హిందూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, శేఖర్ గుప్త, సత్తయ్య పాల్గొన్నారు.



కందుకూరులో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, భక్తులు

కడ్తాల్, ఫిబ్రవరి 10 : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు పోతుగంటి ప్రియాంక-శంకర్ దంపతులు ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, హనుమాన్ చాలీసా పఠనం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బీచ్యానాయక్, వేణుగోపాల్, రామునాయక్, నంద్యానాయక్, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్, ఫిబ్రవరి 10 : మారుతున్న కాలాన్ని, టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ శివప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలు, నైతిక విలువపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఎంచుకున్న రంగంలో రాణించాలన్నారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణతో నడుచుకోవాలని, నైతిక విలువలతో మెలగాలని వివరించారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతమ్మ, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, విద్యా కమిటీ చైర్మన్ రవీందర్, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




ఉచిత వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్, ఫిబ్రవరి 10: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 81 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇందులో 33 మందిని కంటి ఆపరేషన్ల కోసం గుర్తించారు. మరో 26 మందిని అద్దాల కోసం గుర్తించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎల్వీప్రసాద్ కంటి దవాఖాన నెట్‌వర్క్ కో ఆర్డినేటర్ సురేందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమించిన రోడ్డును పరిరక్షించండి

హయత్‌నగర్, ఫిబ్రవరి 10 : హయత్‌నగర్ డివిజన్‌లోని ఓ ప్రైవేట్ దవాఖాన యాజమాన్యం ఆక్రమించిన రోడ్డును పరిరక్షించాలని జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, డయస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్‌ను వేర్వేరుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పలు కాలనీల వాసులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్ బస్ డిపోకు వెళ్లే రోడ్డు పక్కన కృష్ణవేణి ఆస్పత్రి యాజమాన్యం కొంత మేరకు ఆక్రమించారని తెలిపారు. అదే రోడ్డులో రెండు ఆర్టీసీ బస్ డిపోలు, కోర్టు, కళాశాల, దాదాపు 14 కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని వివరించారు. ప్రధాన రోడ్డును కొంత మేరకు ఆస్పత్రి యాజమాన్యం ఆక్రమించడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. దీనిపై డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కమిషనర్ రొనాల్డ్ రోస్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.